సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 15 । జూలై । 2025



టన్ను చీనీ రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



పెన్షనర్ల దిగాలు

కూటమి ప్రభుత్వ తీరుతో ప్రభుత్వ పెన్షనర్లు కన్నీరు పెడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక ప్రయోజనాల కోసం నేడు కలెక్టరేట్ ముట్టడికి సిద్ధమయ్యారు.

8లో

గరిష్టం/కనిష్టం
35.2°/21.6°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

అర్జీదారుడు సంతృప్తి చెందాలి

- పీజీఆర్‌ఎస్‌లో అందే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి
- అధికారులకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: ''క్షేత్రస్థాయికి వెళ్లండి..సమస్యను స్వయంగా పరిశీలించండి.. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపండి'' అని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపి ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 281 అర్జీలు అందగా... వాటి పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపారు. అనంతరం జేసీ అభిషేక్ కుమార్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...కలెక్టరేట్‌లో అర్జీ ఇస్తే తమ సమస్య పరిష్కారం అవుతుందని ప్రజలు ఎంతో నమ్మకంతో ఇక్కడిదాకా వచ్చి అర్జీ ఇస్తారని, అధికారులు బాధ్యత వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయసారథి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు మడకశిర చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

- ఎన్నికల అధికారిగా పెనుకొండ ఆర్డీఓ ఆనందకుమార్

మడకశిర: స్థానిక నగర పంచాయతీ చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలకు బుధవారం ఎన్నిక జరుగనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. పెనుకొండ ఆర్డీఓ ఆనందకుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రత్యేక కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సమావేశానికి కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులంతా తప్పకుండా హాజరు కావాలని కోరారు.

పది, ఇంటర్ ప్రవేశాలకు 16న కౌన్సెలింగ్



అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పదో తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం సీట్ల భర్తీకి ఈనెల 16న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సమన్వయ అధికారి జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కురుగుంట స్కూల్‌లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. పదో తరగతికి సంబంధించి ఉరవకొండ స్కూల్‌లో ఎస్టీ-1, బీసీ-1, ఓసీ-1, హిందూపురం బాలికల పాఠశాలలో ఎస్సీ-7, అమరాపురంలో ఎస్టీ-1, ఓసీ-1, మలుగూరులో ఎస్సీ-2, ఎస్టీ-1 ఖాళీలున్నాయన్నారు. సీనియర్ ఇంటర్‌కు సంబంధించి... ఉరవకొండ ఎస్సీ-48, ఎస్టీ-3, బీసీ-3, ఓసీ-2, నల్లమాడలో 55, కురుగుంటలో ఎస్సీ-1, ఎస్టీ-2, బీసీ-2, హిందూపురం (బాలికలు)లో ఓసీ-1, అమరాపురంలో ఎస్సీ-1, ఓసీ-1, మలగూరులో ఎస్సీ-19, బీసీ-1 సీటు ఖాళీ ఉందన్నారు. 16న నేరుగా స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

బీమా ప్రీమియం చెల్లింపునకు నేడు ఆఖరు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో వాతావరణ బీమా పథకం కింద గుర్తించిన పంటలకు ప్రీమియం చెల్లింపు గడువు మంగళవారంతో ముగియనుంది. బీమా కింద నోటిఫై చేసిన వేరుశనగ ఎకరాకు రూ.640 ప్రకారం ప్రీమియం కట్టాలి. పత్తికి రూ.1,140, దానిమ్మకు రూ.3,750, చీనీ, బత్తాయికి రూ.2,750, టమాటకు రూ.1,600, అరటికి రూ.3 వేల ప్రకారం జూలై 15 లోపు ప్రీమియం కట్టాలంటూ వారం క్రితం వ్యవసాయశాఖ ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే ఇంకా వేలాది మంది ప్రీమియం చెల్లించాల్సిన ఉంది. ఈ క్రమంలో ఈనెలాఖరు వరకు గడువు పొడిగించాలని జిల్లా వ్యవసాయశాఖ కమిషనరేట్ అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది.



ధర్మవరంలో 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న వేంపల్లి సతీష్‌రెడ్డి, ఉషశ్రీచరణ్, రమేష్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తదితరులు



'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' సభకు హాజరైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు

మోసం చంద్రబాబు నైజం

- మోసపూరిత హామీలతో అందరినీ వంచించారు
- 143 హామీలు.. 'సూపర్ సిక్స్'కు దిక్కులేదు
- ఎన్నికల వేళ హామీలతో అరచేతిలో వైకుంఠం
- అధికారంలోకి రాగానే అందరికీ నరకం
- బాబు మోసాలు ఇంటింటా తెలియజేయాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేంపల్లి సతీష్‌రెడ్డి
- ధర్మవరంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం
- కేతిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భారీగా పాల్గొన్న జనం
- ఉషశ్రీచరణ్, రమేష్‌రెడ్డి, పలువురు నాయకులు హాజరు



సతీష్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఉషశ్రీచరణ్‌ను గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ధర్మవరం: ''ప్రతి ఎన్నికలోనూ ఆచరణకు సాధ్యం కాని హామీలను గుప్పించడం..అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా అందరినీ మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య..అందుకే వంచనకు మారు పేరుగా చంద్రబాబు నిలిచారు'' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేంపల్లి సతీష్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మారుతీ రాఘవేంద్ర స్వామి కల్యాణ మండపంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ''బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ'' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వేంపల్లి సతీష్‌రెడ్డితో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేష్‌రెడ్డి తదితరులు హాజరై 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల వేళ సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలిచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా వాటిని అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేశారన్నారు. ఈ దారుణ వంచనను ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. 'సూపర్‌సిక్స్' హామీల్లో భాగంగా ప్రతి రైతుకు రూ.20 వేలు అందిస్తామని చెప్పినా, ఇప్పటి వరకు అమలు చేయడం లేదన్నారు. దీనికి తోడు పంటలకు మద్దతు ధర కూడా ఇవ్వకుండా రైతు జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం అంటూ ఊరించినా.. నేడు ఆ హామీని బుట్టదాఖలు చేశారన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లు ఇస్తామని చెప్పి కేవలం ఒక సిలిండర్ ఇచ్చి ఆ పథకాన్ని నిర్వీర్యం చేశారన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఎన్నికలవేళ చెప్పిన చంద్రబాబు అధికారంలోకి రాగానే వలంటీర్లను రోడ్డునపడేశారని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలను రద్దు చేశారన్నారు. 'తల్లికి వందనం'లోనూ ఆంక్షలు విధించి సగానికి పైగా అర్హులకు పథకం అందకుండా చేశారన్నారు. ఇలా ప్రజలను అన్ని రకాలుగా బాధపెడుతున్న చంద్రబాబు తన కార్యకర్తలు, నాయకులకు మాత్రం బెల్ట్‌షాపు, ఇసుక అక్రమ రవాణా, మట్టి రవాణా చేసుకునేలా అనుమతులిచ్చి దోచిపెడుతున్నారన్నారు.

ఏడాదిలోనే ప్రజా వ్యతిరేకత

సీఎం చంద్రబాబు చేసిన మోసాన్ని గ్రహించిన ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని సతీష్‌రెడ్డి అన్నారు. అందుకే జనం లేక చంద్రబాబు సభలు వెలవెల బోతున్నాయన్నారు. మరోవైపు ప్రజా సమస్యలపై వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా జనం నీరాజనాలు పడుతున్నారన్నారు. జగన్ కార్యక్రమాల్లో జనం పాల్గొనకుండా చేయాలని చంద్రబాబు ఎంత ప్రయత్నిస్తే అంత ఎక్కువగా జనాలు వస్తున్నారన్నారన్నారు. చంద్రబాబు పోలీసులతో భయపెట్టాలని చూసినా... జగన్ పర్యటనకు పల్లెలు, పట్టణాలే కదిలివస్తున్నాయన్నారు. ప్రకాశం జిల్లా పొదిలి, చిత్తూరు జిల్లా బంగారు పాళ్యం, శ్రీసత్యసాయిజిల్లా పాపిరెడ్డిపల్లి, గోరంట్లలో జరిగిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాలకు వచ్చిన జనసంద్రాన్ని చూసి చంద్రబాబుకు మైండ్ బ్లాంక్ అయ్యిందన్నారు. అందుకే అతని జగన్ భయం పట్టుకుందన్నారు.

జగనన్న 2.0 లో కార్యకర్తకే అందలం

త్వరలో వచ్చేది జగనన్న ప్రభుత్వమేనని, జగనన్న 2.0లో ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. జగనన్నకు ఒక కన్ను ప్రజలైతే మరో కన్ను కార్యకర్తలేనని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, శ్రేణులు బాబు మోసాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జయభేరి మోగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ధర్మవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాబుకు నైతిక విలువలు లేవు



సీఎం చంద్రబాబుకు నైతిక విలువలు లేవు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో దాదాపుగా రూ.1.50 లక్షల కోట్లు అప్పులు చేశారు. అయినా సంక్షేమ పథకాలు అందించకుండా కేవలం కోటరీకి, టీడీపీ శ్రేణులకు మేలు జరిగేలాగా వ్యవహరించారు. అభివృద్ధి పేరుతో అడ్డంగా దోచుకున్నారు. ఒక ఎన్నికల్లో మోదీని తిడతారు.. మరో ఎన్నికల్లో పొగుడుతారు. విలువలు వదిలేసి కాంగ్రెస్‌తో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకుంటారు. ఇలా ఊసరవెల్లిలా రాజకీయాలు చేసే వ్యక్తి ఆంధ్ర రాష్ట్రానికి పనికి రాడు. చంద్రబాబు చేసిన మోసాలను రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలి. అందరూ కలసి సమష్టిగా కృషి చేస్తే వచ్చే ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్లు రావు.

–రమేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు

గ్రామ గ్రామానా నినదిద్దాం



కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా మోసం చేసిన తీరును ఇంటింటికీ వెళ్లి వివరించాలి. ప్రజలను వంచించిన కూటమి సర్కార్ గుండెల్లో రైళ్లు పరిగెట్టేలా ప్రజలతో కలిసి గ్రామ గ్రామానా నినదిద్దాం. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, సోషల్ మీడియా సభ్యులు... ప్రతి ఒక్కరు ధైర్యంగా ఎదురొడ్డి పోరాడాలి. ప్రజల్లో చైతన్యం తెచ్చి రానున్న ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాలు క్లీన్‌స్వీప్ చేసేలా కృషి చేయాలి. త్వరలోనే జిల్లా, గ్రామ, పంచాయతీ కమిటీలను పూర్తి చేసి పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేస్తాం. త్వరలో జగనన్న ప్రతి జిల్లాలోను పర్యటించి కార్యకర్తల సమస్యలు తెలుసుకుంటారు. అభివృద్ధి, సంక్షేమం సమంగా అందించిన జగనన్న పాలనను త్వరలోనే చూడబోతున్నాం.

–ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు

ఏడాదిలోనే అధర్మవరంగా మార్చారు

ధర్మవరం ప్రభుత్వాస్పత్రిలోని మరుగుదొడ్లకు డోర్లు లేవు. అలాంటిది మంత్రి సత్యకుమార్ నియోజకవర్గానికి మెడికల్ కాలేజీ, ఇంజినీరింగ్ కాలేజీ తెస్తారా..? అని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. ఎన్నికలకు నెల ముందు వచ్చి నోటికొచ్చిన హామీలన్నీ ఇచ్చి గెలిచిన ఆయన.. తీరా అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ సమస్యలు విస్మరించారన్నారు. నెలకు ఒకటి రెండు రోజులు వచ్చే సత్యకుమార్... సున్నం మంత్రిగా పేరుగాంచారన్నారు. చేనేత కార్మికులకు అండదా నిలిచే 'నేతన్న నేస్తం' పథకాన్ని అటకెక్కించారని, అప్పుల బాధతో చేనేతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా కనీసం పట్టించుకోవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లోకల్ అజెండాతో అనేక హామీలిచ్చినా ఒక్కటికూడా అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేశారన్నారు. గతంలో ధర్మవరం అంటే ఓ మంచిపేరు ఉండేదని, ఇప్పుడు ధర్మవరం నియోజకవర్గాన్ని ఇసుక, లిక్కర్ అక్రమ వ్యాపారానికి అడ్డాగా మార్చారని మండిపడ్డారు. దాడులు, దౌర్జన్యాలతో ఏడాదిలోనే అధర్మవరంగా మార్చారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను సత్యకుమార్‌కు గుర్తు చేసి వాటి అమలుకు ప్రజలు నిలదీయాలన్నారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలను, చేసిన మోసాలన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు ప్రజలకు తెలియజేసి చైతన్యం పరచాలన్నారు. ప్రతి ఒక్కరు క్యూఆర్ కోడ్‌ను డౌన్‌లోడ్ చేసుకుని 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ'పై విస్తృత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



కచేరీ నిర్వహిస్తున్న భక్తులు

ఆకట్టుకున్న సంగీత కచేరీ

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ట్రినిడాడ్ అండ్ టోబాగో దేశానికి చెందిన భక్తులు సోమవారం సాయంత్రం సత్యసాయి మహా సమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. టూ లవ్ – విత్ లవ్ – ఫ్రం లవ్ పేరుతో సత్యసాయిని కీర్తిస్తూ వారు నిర్వహించిన కచేరీ భక్తులను మంత్ర ముగ్ధులను చేసింది.

హెచ్చెల్సీకి నవంబర్ నెలాఖరు వరకూ నీరు

బొమ్మనహాళ్: హెచ్చెల్సీకి నవంబర్ నెలాఖరు వరకు తుంగభద్ర జలాలను విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని టీబీ డ్యాం ఎస్‌ఈ నారాయణ నాయక్ తెలిపారు. సోమవారం బొమ్మనహాళ్ వద్ద ఆంధ్రా సరిహద్దులోని 105వ కిలోమీటర్ వద్ద కాలువను, రెగ్యులేటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టిందన్నారు. ఇటీవల డ్యాం నంచి 1,400 క్యూసెక్కుల నీటిని హెచ్చెల్సీకి వదిలామన్నారు. 105వ కిలోమీటర్ వద్దకు 500 క్యూసెక్కుల మేర వస్తున్నట్లు తెలిపారు. నవంబర్‌లో వర్షాలు వస్తే హెచ్చెల్సీకి నీటి వాటా పెంచుతామన్నారు. ఆంధ్రాలో అత్యవసర మరమ్మతు పనులు జరుగుతున్న నేపథ్యంలో నీటిని తీసుకునేందుకు ఆలస్యం కావొచ్చన్నారు. టీబీ డ్యాం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 100 టీఎంసీలు కాగా.. 33 క్రస్ట్ గేట్లకు మరమ్మతులు చేయాల్సిన నేపథ్యంలో 80 టీఎంసీలకు కుదించామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జూలై మొదటి వారంలోనే డ్యాం పూర్తి స్థాయిలో నిండిందన్నారు. ప్రస్తుతం 39,667 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 25,181 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదవుతోందన్నారు. డ్యాం 5 క్రస్ట్ గేట్లను రెండున్నర అడుగుల మేర ఎత్తి 14,590 క్యూసెక్కులను నదికి విడుదల చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీఈ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, జేఈ రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న టీబీ డ్యాం ఎస్‌ఈ నారాయణ నాయక్

అలవాటు.. గ్రహపాటు

- హిందూపురానికి చెందిన ముగ్గురు కుర్రాళ్లు ప్రతి శని, ఆదివారాల్లో రాత్రి 11 గంటలు దాటిన తర్వాత కారులో బయలుదేరి బెంగళూరు విమానాశ్రయం వెళ్తారు. తెల్లవారుజామున 3 గంటలకు తిరుగు పయనమవుతారు. తెల్లవారుజామున 5.30 గంటలకు పడుకుని ఉదయం 10.30 గంటలకు లేస్తారు. ఆ తర్వాత నేరుగా మధ్యాహ్న భోజనం తింటారు. దీంతో ఉదయం టిఫిన్ తినడం మానేశారు. ఫలితంగా ముగ్గురికీ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. పైగా మిగతా రోజుల్లో తెల్లవారుజాము వరకూ నిద్ర పట్టక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- 'కియా' ఉద్యోగులు ఆరుగురు ఒకే విల్లాలో ఉంటారు. రోజూ రాత్రి 10 గంటలు దాటిన తర్వాత టీ తాగేందుకు బాగేపల్లి టోల్ గేట్ వరకు వెళ్తుంటారు. తిరిగి వచ్చేసరికి అర్ధరాత్రి 1 నుంచి 2 అవుతోంది. నిద్రపట్టేందుకు మరో గంట పడుతుంది. దీంతో అందరూ నిద్రలేచే సమయంలో నిద్రకు ఉపక్రమిస్తారు. మధ్యాహ్నం ఎప్పుడో నిద్రలేచి ఉన్నఫలంగా పది నిమిషాల్లో రెడీ అయి డ్యూటీకి వెళ్తున్నారు. నీరసం, నిద్ర ఒకేసారి వస్తుండటంతో విధులు కూడా సరిగా నిర్వహించలేక చివాట్లు తింటున్నారు.

యువత.. పెడదోవ

- స్నేహితులతో కలిసి బెంగళూరు వరకూ షికారు
- అర్ధరాత్రి రయ్‌రయ్ మంటూ రోడ్డుపై పయనం
- మరికొందరు పొద్దుపోయే వరకూ సెల్‌ఫోన్లలో బిజీ
- ప్రమాదాలు, అనారోగ్యం బారిన పడుతోన్న యువత
- మానసిక, శారీరక సమస్యలతో సతమతం



సాక్షి, పుట్టపర్తి: జిల్లాలోని హిందూపురంతో పాటు చిలమత్తూరు, కొడికొండ చెక్‌పోస్టు, పెనుకొండ, పుట్టపర్తి ప్రాంతాల నుంచి యువత నిత్యం బెంగళూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. టీ తాగాలంటే ఓ ప్రాంతం.. టిఫిన్ తినాలంటే మరో ప్రాంతానికి వెళ్లడం అలవాటుగా మార్చుకున్నారు. ఫలితంగా రాత్రింబవళ్లు తేడా లేకుండా తిరగడం మొదలుపెట్టారు. దీంతో జీవనశైలిలో మార్పులు రాగా రోగాల బారిన పడుతున్నారు.

అర్ధరాత్రి చక్కర్లు..అనర్థాలు


జిల్లా యువకులు మెట్రో సిటీ యువతతో పోటీ పడాలని భావిస్తున్నారు. ఈక్రమంలో అర్ధరాత్రి వేళ కార్లలో చక్కర్లు కొట్టడం ఫ్యాషన్‌గా మార్చుకున్నారు. ఈ క్రమంలో జిల్లా నుంచి బెంగళూరుకు రయ్యిమంటూ దూసుకెళ్తున్నారు. అయితే జాతీయ రహదారి కావడంతో చాలామంది ప్రమాదాల బారిన పడి జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు. మరికొందరు ఇలా అర్ధరాత్రి తిరుగుళ్లకు అలవాటు పడి నిద్రలేమితో ఆస్పత్రుల బాట పడుతున్నారు. బెంగళూరు పక్కనే ఉండటంతో గంట వ్యవధిలో వెళ్లి రావచ్చనే ఉద్దేశంతో టక్కున వెళ్లి వస్తున్నారు. పగటి పూట పనుల్లో బిజీగా ఉంటూ రాత్రివేళ తిరిగేందుకు అలవాటు పడి నిద్రకు దూరమైన లేనిపోని రోగాల కొని తెచ్చుకుంటున్నారు.

యువకులే అధికం

అర్ధరాత్రి వేళ చక్కర్లు కొట్టే వారిలో యువకులే 90 శాతం మంది ఉండటం విశేషం. విధులు ముగించుకుని వారంతపు సెలవుల్లో అయితే మద్యం తాగుతారు. ఆ తర్వాత కారుతో రోడ్డెక్కుతారు. రయ్ రయ్ మంటూ బెంగళూరు వరకు వెళ్లాలని గ్యాంగ్‌లో ఎవరో ఒకరు పట్టుబడుతారు. ఫలితంగా ఇష్టం లేని వారు కూడా ప్రమాదమని తెలిసినా.. వెళ్లాల్సి వస్తోంది. ప్రయాణం రద్దు చేసుకుంటే సెల్ ఫోన్లలో బిజీబిజీగా గడుపుతున్నారు. మిగతా రోజుల మాదిరిగా నిద్ర రాకపోవడంతంతో అరచేతిలో స్మార్ట్ ఫోన్ తీసుకుని నొక్కుతూ కాలయాపన చేస్తున్నారు. బయట తిరగడం మానేసిన తర్వాత సెల్ ఫోన్‌తో బిజీ అవుతున్నారు. ఫలితంగా నిద్రకు దూరం అవుతున్నారు. నిద్రలేమి సమస్యలో ఆస్పత్రులకు చేరడం అలవాటుగా మార్చుకున్నారు.

కొంపముంచుతోన్న కల్చర్

సిటీ కల్చర్ పేరుతో జిల్లా యువత కొత్త హంగులకు వెళ్లి లేనిపోని రోగాల బారిన పడుతున్నారు. కొత్త కొత్త విధానాలకు అలవాటు పడి జీవితాలు పాడు చేసుకుంటున్నారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ పెడదారి పడుతున్నారు. పుట్టపర్తి వంటి పట్టణాల్లో విదేశీయులు ఉండటంతో వారితో పరిచయం ఉన్నోళ్లు.. అర్ధరాత్రి వరకూ కాలయాపన చేయడం అలవాటుగా మార్చుకున్నారు. ఫలితంగా జీవనశైలిలో ఒక్కసారిగా వచ్చే మార్పులతో ఇబ్బందులు పడుతున్నారు.



అందని ప్రయోజనాలు.. పెన్షనర్ల దిగాలు

- మూడునెలలుగా మట్టి ఖర్చులనూ అందించని చంద్రబాబు సర్కారు
- పేరుకుపోయిన గ్రాట్యుటీ, ఈఎల్ బకాయిలు
- నేడు కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల ధర్నా



❐ రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న మల్లి కార్జున (పేరు మార్చాం) గత ఏడాది నవంబరులో ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు గ్రాట్యుటీ రూ.16 లక్షలు, ఈఎల్ (ఎర్న్ లీవ్) డబ్బులు సుమారు రూ.10 లక్షలు నేటికీ అందలేదు. ఉద్యోగ విరమణ తరువాత పింఛను తప్ప ఇతర ఆర్థిక ప్రయోజనాలు ఇప్పటికీ తనకు అందలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

❐ ఒక ఉపాధ్యాయుడు గత ఏడాది అక్టోబరులో ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు గ్రాట్యుటీ రూ.16 లక్షలు, ఈఎల్ రూ.12 లక్షలు నేటికీ అందలేదు. ఉద్యోగ విరమణ చేసి తొమ్మిది నెలలు అవుతున్నా బెనిఫిట్లు అందించలేదని, ఇటీవల ఇంట్లో శుభకార్యం చేసేందుకు రూ.10 లక్షలు అవసరమైతే తెలిసిన వారి నుంచి వడ్డీకి డబ్బు తీసుకున్నానని వాపోయారు.

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పెన్షనర్ల పరిస్థితి దయనీయంగా మారింది. వారిపై బాబు సర్కారు కనికరం చూపడం లేదు. ఉద్యోగ విరమణ తరువాత రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను నెలలు గడుస్తున్నా అందించకపోవడంతో ఆవేదన వర్ణనాతీతంగా మారింది. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ, ఎర్న్ లీవ్ వంటి ఆర్థిక ప్రయోజనాలు గత ఏడాది అక్టోబరు నుంచి పెండింగ్‌లో ఉంచారు. ఈ మొత్తం రూ.48 కోట్ల వరకు ఉంటుందని సమాచారం.

మట్టిఖర్చులూ పెండింగ్

పెన్షనర్ చనిపోతే అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు తక్షణ సాయంగా మట్టిఖర్చుల (ఫ్యునరెల్ చార్జెస్) కింద రూ.25 వేలు ఇస్తారు. అయితే, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకూ 100 మంది వరకూ పెన్షనర్లు మరణిస్తే వీరికి సంబంధించి మట్టి ఖర్చులను ఇవ్వకుండా ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచినట్లు తెలిసింది. 100 మందికి రూ.25 లక్షలు చెల్లించాల్సి ఉన్నట్లు సమాచారం. మట్టిఖర్చుల కింద తక్షణ సాయంగా అందించాల్సిన డబ్బునూ పెండింగ్‌లో పెట్టడం ప్రభుత్వ కర్కశత్వానికి అద్దం పడుతోంది.

గ్రాట్యూటీ, ఈఎల్‌కు ఎదురుచూపులు

ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ప్రభుత్వం గ్రాట్యుటీ కింద గరిష్ఠంగా రూ.16 లక్షలు చెల్లిస్తుంది. జిల్లాలో గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు వివిధ హోదాల్లో దాదాపు 200 మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేసినట్లు సమాచారం. వీరికి సంబంధించి గ్రాట్యుటీ సగటున రూ.14 లక్షలుగా చూసినా రూ.28 కోట్లు రావాల్సి ఉంటుంది.

- సర్వీసులో ఉండగా ఉద్యోగులు మిగుల్చుకున్న ఎర్న్ లీవ్‌లను (ఈఎల్) ఉద్యోగ విరమణ సమయంలో ప్రభుత్వానికి వెనక్కి ఇచ్చి వాటికి డబ్బులు తీసుకుంటారు. ఇలా ఒక్కో ఉద్యోగి దాదాపు 300 రోజులు (పది నెలలు) ఎర్న్ లీవులను వెనక్కి ఇస్తారు. ఒక్కో ఉద్యోగికి ఈఎల్‌కు సంబంధించి 10 నెలల వేతనం ప్రభుత్వం చెల్లించాలి. సగటున నెలకు రూ.లక్ష వేసుకున్నా పది నెలలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలుగా 200 మందికి రూ.20 కోట్లను ప్రభుత్వం గత తొమ్మిది నెలలుగా చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచిందని పెన్షనర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం (నేడు) కలెక్టరేట్ వద్ద ప్రభుత్వ పెన్షనర్లు ధర్నాకు పిలుపునిచ్చారు.

నమ్మి మోసపోయాం



కూటమి నాయకుల మాటలు నమ్మి మోసపోయాం. ఉద్యోగ విరమణ చేసిన వారికి పెన్షన్ తప్ప ఇతరత్రా ఆర్థిక ప్రయోజనాలు ప్రభుత్వం నుంచి అందడం లేదు. గత అక్టోబరు నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా తలపెట్టాం.

– శీలా జయరామప్ప, ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం

క్లుప్తంగా

'పోలీస్ స్పందన'కు 61 వినతులు



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 61 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్ట పరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని, అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ అడ్వైజరీ సాయినాథరెడ్డి పాల్గొన్నారు

జాతీయ హాకీ జట్టులో చోటు



విజేత కప్పు అందుకుంటున్న లక్షిత

కదిరి టౌన్: హర్యానాలోని హిసార్ వేదికగా ఇటీవల జరిగిన ఆల్ ఇండియా ఐపీఎస్‌సీ బాలికల అండర్ 17 ప్రీ నెహ్రూ కప్ హాకీ టోర్నీలో కదిరికి చెందిన సి.వి.లక్షిత ప్రతిభ చాటి జాతీయ జట్టులో చోటు దక్కించుకుంది. కదిరిలోని చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ సి.వి.మదన్ కుమార్ కుమార్తె లక్షిత.. కర్ణాటకలోని కిట్టూరులో ఉన్న రాణి చెన్నమ్మ సైనిక స్కూల్‌లో చదువుతోంది. హాకీలో గోల్‌కీపర్‌గా ప్రతిభ చాటుతోంది. ఐపీఎస్‌సీ టోర్నీలో ఉత్తమ ప్రతిభ చూపడంతో లక్షితను హాకీ అండర్ 16 జాతీయ జట్టుకు ఎంపిక చేసినట్లు సైనిక స్కూల్ కోచ్ జయలక్ష్మి వెల్లడించారు. ఈ సందర్భంగా లక్షితను కదిరి వాసులు అభినందిస్తున్నారు.

రైలు కింద పడి రైతు మృతి



రామాంజనేయులు (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: ప్రమాదవశాత్తు రైలు కింద పడి ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. చెన్నేకొత్తపల్లి మంలడం ఆమిదాలకుంట గ్రామానికి చెందిన రామాంజనేయులు (40)కు భార్య శమంతకమణితో పాటు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి పొలం వద్దకు కాపలాకు వెళ్లిన ఆయన సోమవారం తెల్లవారుజామున ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో పట్టాలు దాటుతున్న సమయంలో వేగంగా వచ్చిన రైలు ఢీకొని, అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై హిందూపురం రైల్వే పోలీసులు కుపేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జేఎన్‌టీయూలో 1,935 సీట్ల తగ్గింపు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలోని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల పరిధిలో సీట్ల ఖరారు పూర్తయింది. జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో మొత్తం 69 అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలకు గాను ఈ విద్యాసంవత్సరానికి 59,244 సీట్ల ఏఐసీటీఈ మంజూరు చేసింది. కళాశాలల నిజనిర్ధారణ కమిటీల సిఫార్సు మేరకు 1,935 సీట్లను తగ్గిస్తూ మొత్తం 57,309 ఇంజినీరింగ్ సీట్లను ఖరారు చేశారు. వీటిని ఏపీఈఏపీసెట్ -2025 వెబ్ ఆప్షన్ల ఎంపికకు అందుబాటులో తెచ్చేందుకు ఉన్నత విద్యామండలికి నివేదించారు. బీబీఏ, బీసీఏ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ కోర్సులకు సంబంధించి 77,296 సీట్లకు ఏఐసీటీఈ ఆమోదం తెలపగా, 74,145 సీట్లను భర్తీ చేసుకునేందుకు వర్సిటీ తుది ఆమోదం తెలిపింది.

కారులో నగదు చోరీ

గోరంట్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ప్రధాన రహదారి పక్కనే ఆపిన కారులో నుంచి నగదును దుండగులు అపహరించారు. వివరాలు.. గోరంట్ల మండలం మల్లాపల్లి గ్రామానికి చెందిన వసంతరావు, ఆయన సోదరుడు రామచంద్రరావు సోమవారం ఉదయం గోరంట్లలోని ఎస్‌బీఐ శాఖకు చేరుకుని రూ.7 లక్షలు డ్రా చేశారు. ఈ మొత్తాన్ని కారులో ఉంచుకుని రామచంద్రరావు కుమారుడి వివాహ వేడుకలు నిర్వహించేందుకు పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న వాసవీ మహాల్ ఫంక్షన్ హాల్‌ను చూసేందుకు వెళ్లారు. ఫంక్షన్ హాల్ ఎదుట కారు నిలిపి లాక్ చేసుకుని లోపలకు వెళ్లిన వారు తిరిగి వచ్చే లోపు కారు డోర్ అద్దం పగులగొట్టి ఉంది. కారులో ఉంచిన నగదు కనిపించలేదు. నగదు అపహరించారని నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో పెనుకొండ డీఎస్పీ నర్సింగప్ప, సీఐ శేఖర్ తదితరులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ షాక్‌తో బాలికకు తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న వెంకటేశ్వరి

ధర్మవరం అర్బన్: స్థానిక శారదా నగర్‌లో నిర్మాణంలో ఉన్న కట్టడంలో ఆడుకుంటున్న ఓ బాలిక విద్యుత్ షాక్‌తో తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన మేరకు ఒంగోలుకు చెందిన హరి, రపిక దంపతులు ధర్మవరం పట్టణానికి వలస వచ్చి గృహ నిర్మాణ పనులతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం శాంతి నగర్‌లో ఇంటి నిర్మాణ పనులకు వెళ్లిన వారు తమతో పాటు 11 ఏళ్ల కుమార్తె వెంకటేశ్వరినీ పిలుచుకెళ్లారు. కట్టడం వద్ద ఇనుపరాడ్‌పై పడిన విద్యుత్ తీగను గమనించని వెంకటేశ్వరి ఆడుకుంటూ వెళ్లి దానిని తాకింది. దీంతో షాక్‌కు గురై కుప్పకూలడంతో తల్లిదండ్రులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. దాదాపు 50 శాతం కాలిన గాయాలతో ఉన్న బాలికకు వైద్యులు ప్రథమ చికిత్స అందజేసి, అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై రెండో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గోల్డ్ స్కీమ్ పేరిట చీటింగ్



జ్యువెలరీ షాపు వద్ద ఆందోళనకు దిగిన బాధితులు

గుంతకల్లు టౌన్: గోల్డ్ స్కీమ్ పేరిట గుంతకల్లుకు చెందిన జ్యువెలరీ షాప్ నిర్వాహకుడు నూరుల్లా రూ.లక్షల్లో కుచ్చుటోపీ పెట్టి ఉడాయించాడు. విషయం తెలియగానే బాధితులు పెద్ద సంఖ్యలో సోమవారం సాయంత్రం పాత గుత్తి రోడ్డులోని ఓ నర్సింగ్‌హోమ్ వద్ద ఉన్న సుల్తానియా జ్యువెలరీ షాపు వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. జ్యువెలరీ షాపును అద్దెకిచ్చిన యజమాని ఖాళీ చేయిస్తామని అక్కడికి వెళ్లడంతో బాధితులంతా అతడితో వాదించారు. పిల్లల పెళ్లిళ్లు, ఇతర అవసరాల నిమిత్తం బంగారు షాపు నిర్వాహకుడు నూరుల్లాకి తాము పోగు చేసుకున్న డబ్బును నెలానెల చెల్లించి మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అతడిని ఇక్కడికి రప్పించి తమ డబ్బును తమకు ఇప్పించాలని బాధితులు కోరుతూ ఆర్‌డీఓ, టూటౌన్ పోలీసులను కలసి విన్నవించారు.

మంత్రి ఇలాకాలో విద్యార్థులకు అందని కోడిగుడ్లు

- డప్పు కొడుతూ నిరసన వ్యక్తం చేసిన జైభీం నాయకులు



ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

పరిగి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కోడి గుడ్లు అందకపోవడాన్ని నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం జైభీమ్ పార్టీ నాయకుడు ఊటుకూరు నాగరాజు ఆధ్వర్యంలో ఎంఈఎఫ్ నాయకుడు చౌళురు రవి తదితరులు మోకాలిపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డప్పు కొడుతూ ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దారు హనుమంతుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఇవ్వడం లేదని మండిపడ్డారు. సాక్షాత్తు రాష్ట్ర మంత్రి సవితమ్మ ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఇలాంటి దుస్థితి ఉంటే ఇక రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఊహించలేమన్నారు. ఇప్పటికైనా మంత్రి సవిత తన నియోజకవర్గంలో కోడిగుడ్ల ఏజెన్సీ నిర్వాహకుల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, ఇటీవల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ జరిగిన రోజున సమావేశానికి వచ్చిన తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లను ఇవ్వడం జరిగిందని ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం తెలిపారు. దీంతో కొరత కారణంగా సోమవారం కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కోడి గుడ్లను ఇవ్వలేకపోయారని వివరించారు.

ముడుపుల వల.. చర్యలకు వెనకడుగు

- రెడ్డెప్పశెట్టిపై కనిపించని చర్యలు
- ఆందోళనలో రైతులు

చిలమత్తూరు: రైతులను, ప్రభుత్వాన్ని మోసం చేసి ప్రభుత్వ భూములను కబ్జా చేసిన రియల్టర్ రెడ్డెప్పశెట్టిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకంజ వేశారు. ఈడీ అటాచ్‌మెంట్ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టి, దౌర్జన్యంగా నదీ జలాలను వినియోగించుకునేందుకు ఏకంగా చిత్రావతి నదిపై సిమెంటు వంతెన నిర్మించిన రెడ్డెప్పశెట్టి.. స్థానిక రైతుల భూములను అప్పనంగా తక్కువ ధరకే కాజేసి, డబ్బు ఎగ్గొట్టి, విద్యుత్ చౌర్యానికి తెరలేపినా అధికారులు కనీసం పట్టించుకోకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెడ్డెప్పశెట్టి నుంచి భారీగా ముడుపులు తీసుకున్న కారణంగానే అతనిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకాడుతున్నట్లుగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారులంతా తన చేతిలోనే?

మండల స్థాయి మొదలు, జిల్లా స్థాయి వరకూ అన్ని శాఖల అధికారులు తన గుప్పిట్లోనే ఉన్నారంటూ తన వద్దకు వెళ్లిన రియల్టర్లతో రెడ్డెప్పశెట్టి వాఖ్యానించినట్లుగా విశ్వసనీయ సమాచారం. 'పత్రికలు వాస్తవాలు రాసినంత మాత్రాన చర్యలు తీసుకోవాల్సింది అధికారులే కదా..... వాళ్లు తనను కాపాడతారే కానీ, చర్యలు తీసుకోరు. ఇక రైతులు ఏమి చేయలేరు' అంటూ వాఖ్యానించినట్లుగా తెలుస్తోంది. ఈ రకమైన వ్యాఖ్యల వెనుక పరమార్థం చూస్తుంటే అధికారులు నిజంగానే రియల్టర్ రెడ్డెప్పశెట్టికి దాసోహమయ్యారా అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

కోర్టులను తప్పుదోవ పట్టించే యత్నం

నదిపై అక్రమ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి, నదీ జలాలను సొంత అవసరాలకు వాడుకున్న రియల్టర్ రెడ్డెప్పశెట్టిపై చర్యలు తీసుకునేందుకు ఇరిగేషన్ అధికారులు ముందడుగు వేసి, కేసు నమోదు చేయించారు. విక్షన్ ఇచ్చి బ్రిడ్జి కూల్చే క్రమంలో సదరు రియల్టర్ నకిలీ రైతులను సృష్టించి వారి కోసమే బ్రిడ్జి ఏర్పాటు చేశామని కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశాడు. అలాగే విద్యుత్ చౌర్యానికి పాల్పడిన సదరు రియల్టర్‌పై రూ.13 లక్షల భారీ జరిమానాను విద్యుత్ శాఖ విధించింది. దీనిపై కూడా ఆయన కోర్టుకు వెళ్లి తాను రైతునంటూ నమ్మించే ప్రయత్నం చేశాడు.

కలెక్టర్ సారూ... మా గోడు వినండి

రెడ్డెప్పశెట్టి అక్రమాలను వెనకేసుకొస్తున్న అధికారులు తమకేమీ న్యాయం చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాలకు దారి ఇవ్వకుండా వేధిస్తుండడం, భూములు తీసుకుని డబ్బు ఎగ్గొడుతున్న తీరు తమను కలచివేస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకుంటున్నారు. తమకు డబ్బు ఇవ్వకుండా భూములను తన ఆధీనంలో ఉంచుకున్న రెడ్డెప్పశెట్టిపై చర్యల తీసుకుని భూములను విడిపించాలని కోరుతున్నారు.

రెండుకు చేరిన ప్రమాద మృతుల సంఖ్య

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు వద్ద 44వ జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున చోటు చేసుకున్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా ఆదోని పట్టణానికి చెందిన షేక్ మహమ్మద్ హుస్సేన్ (45) అనంతపురం మార్కెట్ యార్డు నుంచి మొక్క జొన్న కంకులను ఆటోలో లోడు చేసుకుని ఆదివారం వేకువజామున తిరుగు ప్రయాణమై, కల్లూరు పెన్నానది బ్రిడ్జి వద్ద ఆటో టైర్ మారుస్తుండగా కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరియమ్మ, ఉమాదేవిని అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్సకు స్పందించక ఉమాదేవి (38) మృతి చెందింది. ఆమెకు ఓ కుమారుడు ఉన్నాడు.

రైతుల నగదు చోరీకి యత్నం

కళ్యాణదుర్గం రూరల్: ముగ్గురు రైతులకు చెందిన నగదును చోరీ చేసేందుకు ఓ అగంతకుడు విఫలయత్నం చేసిన ఘటన కళ్యాణదుర్గంలో చోటుచేసుకుంది. వివరాలు.. బెళుగుప్ప మండలం విరుపాపల్లికి చెందిన రైతు గోవిందప్పతో పాటు మరో ఇద్దరు రైతులు సోమవారం కళ్యాణదుర్గంలోని యూనియన్ బ్యాంక్ శాఖకు వచ్చారు. తమ పంట రుణాలను రెన్యూవల్ చేసిన అనంతరం ఖాతాలో నుంచి రూ.6 లక్షలు విత్‌డ్రా చేసి గోవిందప్పకు అప్పగించి, మిగిలిన ఇద్దరు పనిపై వెళ్లిపోయారు. నగదును గోవిందప్ప తన ద్విచక్ర వాహనం సైడ్ బ్యాగ్‌లో ఉంచి విద్యుత్ కార్యాలయం సమీపంలోని హోటల్‌లోకి వెళ్లి భోజనం చేస్తూ తన వాహనంపై నిఘా ఉంచాడు. కాసేపటికి ఓ యువకుడు ద్విచక్ర వాహనంలోని నగదును అపహరించే ప్రయత్నం చేయగా గట్టిగా కేకలు వేయడంతో నగదు అక్కడే పడేసి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని సీసీ ఫుటేజీల ఆధారంగా విచారణ చేపట్టారు.

ముదిగుబ్బలో వ్యక్తి అనుమానాస్పద మృతి

- పోస్టుమార్టం చేయకుండానే హడావుడిగా మృతదేహం ఖననం
- వాస్తవాలు బయటకు రాకుండా తొక్కిపెట్టిన టీడీపీ నేత!

ధర్మవరం: ముదిగుబ్బ మండల కేంద్రంలోని పదో వార్డులో షెక్షా (48) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు కొందరు చెబుతుండగా... మరికొందరు మాత్రం అనుమానాస్పద స్థితిలో చనిపోయాడని అంటున్నారు. అయితే మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా ఖననం చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. షెక్షా ముదిగుబ్బ పదో వార్డులో గాలిమిషన్ నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. ఆదివారం రాత్రి ఇంట్లో గొడవ జరిగింది. ఈ గొడవ తర్వాత అతను ఉరి వేసుకున్నాడంటూ బంధువులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం తెలిసిన తర్వాత మండల కేంద్రానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు మంత్రాంగం నడిపాడు. అతను ఆసుపత్రి వద్దకు చేరుకుని వైద్యులతో మాట్లాడాడు. గుండెపోటుతో మృతి చెందాడని బంధువులతో చెప్పించాడు. ఈ వ్యవహారంలో తలదూర్చవద్దని స్థానిక పోలీసులకు సైతం సూచించాడు. సోమవారం ఉదయం గుట్టుచప్పుడు కాకుండా షెక్షా మృతదేహాన్ని బంధువుల ద్వారా ఖననం చేయించాడు. కనీసం పోస్టుమార్టం చేసి ఉంటే అది హత్యా? ఆత్మహత్యా? లేక సహజ మరణమా అన్నది తెలిసే అవకాశం ఉండేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.

గంజాయి స్వాధీనం?

సోమందేపల్లి: స్థానిక పెద్ద కొండ సమీపంలో ఉన్న ఓ క్రషర్ వద్ద ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం పోలీసులు అక్కడకు చేరుకుని అనుమానితులను అదుపులోకి తీసుకుని, పెద్ద మొత్తంలో గంజాయి స్వాధీనం చేసుకున్న పట్టుపడిన వారిని స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

గిరినాథ్‌కు రూ.10లక్షలు

- ఏపీఎల్‌లో అత్యధిక ధరతో వేలం
- జిల్లాకు చెందిన 11 మంది క్రికెటర్లకు అవకాశం



గిరినాథరెడ్డి



వినయ్ కుమార్

అనంతపురం: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) 2025 వేలం ప్రక్రియ విశాఖపట్నంలో సోమవారం రాత్రి ముగిసింది. ఏపీఎల్ సీజన్-4 కోసం 520 మంది క్రికెటర్లు వేలంలో పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో అనంతకు చెందిన 11 మంది క్రీడాకారులకు అవకాశం దక్కింది. అత్యధికంగా పి.గిరినాథరెడ్డిని రూ.10.05 లక్షలతో రాయల్స్ ఆఫ్ రాయలసీమ (ఆర్ఆర్) దక్కించుకుంది. రూ.7.50 లక్షలకు బి. వినయ్ కుమార్‌ను అమరావతి రాయల్స్ సొంతం చేసుకుంది. రూ.4.20 లక్షలకు కోగటం హనీష్ వీరారెడ్డిని సింహాద్రి వైజాగ్ లయన్స్ కైవసం చేసుకుంది. పి.అర్జున్ టెండూల్కర్‌ను రూ.1.20 లక్షలకు కాకినాడ కింగ్స్, మచ్చా కె.దత్తారెడ్డిని రూ.60 వేలకు తుంగభద్ర వారియర్స్, జి.మల్లికార్జునను రూ.90 వేలతో అమరావతి రాయల్స్, సంతోష్‌కుమార్‌ను రూ.60 వేలతో అమరావతి రాయల్స్, ఎస్ఎం కమిల్‌ను రూ.50 వేలతో సింహాద్రి వైజాగ్ లయన్స్, ఎస్.మనోజ్‌కుమార్‌ను రూ.30 వేలతో రాయల్స్ ఆఫ్ రాయలసీమ, డీబీ ప్రశాంత్‌ను రూ.2.20 లక్షలు, ఎం.దీపక్‌ను రూ.30 వేలతో తుంగభద్ర వారియర్స్ దక్కించుకున్నాయి.

జేఎన్‌టీయూలో కొత్త కోర్సు

సాక్షి ఎఫెక్ట్..



అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో కొత్త కోర్సు అమలు చేస్తున్నట్లు వీసీ హెచ్.సుదర్శనరావు సోమవారం వెల్లడించారు. వర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలకు త్వరలో అటానమస్ హోదా దక్కనున్న నేపథ్యంలో క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుకోవాల్సిన అనివార్య పరిస్థితి నెలకొంది. అయితే కొత్త కోర్సులను ప్రవేశపెట్టడంలో జాప్యం నెలకొని పేద, మధ్య తరగతి విద్యార్థులు క్యాంపస్‌లో చదివే అవకాశం లేకుండా పోతోంది. ఈ అంశంపై 'విశ్వ ఖ్యాతి.. అధోగతి' శీర్షికన సోమవారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై వీసీ స్పందించారు. ఉన్నత విద్యామండలితో ఫోన్‌లో సంప్రదించి కొత్త కోర్సు అమలుకు చర్యలు తీసుకున్నారు. ఏపీ ఈఏపీసెట్ -2025 వెబ్ ఆప్షన్లలో ఈ కొత్త కోర్సును ఎంపిక చేసుకునే వెసులుబాటును అందుబాటులోకి తెచ్చారు.

కొత్త కోర్సు వివరాలు ఇలా:

జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ అనే కొత్త కోర్సును సెల్ఫ్ ఫైనాన్స్ కింద ప్రవేశపెట్టారు. కన్వీనర్ కోటాలో 66 సీట్లను కేటాయించారు. కోర్సు ఫీజు రూ.75 వేలుగా నిర్ధారించారు. వీటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది.

- కంప్యూటర్ సైన్సెస్‌లో ప్రస్తుతమున్న సీట్లకు అదనంగా 66 సీట్లు కొత్తగా కేటాయించారు. ఒక్కో సీటుకు రూ.1.50 లక్షలుగా నిర్ధారించారు. సెల్ఫ్ సపోర్టింగ్ కేటగిరిలో ఈ సీట్లు కేటాయిస్తారు. వీటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు.
- ఈసీఈలో ఇప్పుడు ఉన్న సీట్లకు అదనంగా 66 సీట్లు కేటాయించారు. ఒక్కో సీటుకు కోర్సు ఫీజు రూ.1.25 లక్షలుగా నిర్దేశించారు. వీటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు. ఈ కోర్సులన్నింటినీ 2025-26 విద్యా సంవత్సరంలో అమల్లోకి తెచ్చారు. బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు వర్తిస్తుంది.